బీజేపీ శ్రేణుల బైక్‌ర్యాలీ



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడిగా గుండగోని భరత్ గౌడ్ ప్రమాణ స్వీకారోత్సవం శనివారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. సుమారు 500 వాహనాలతో ఆర్టీసి క్రాస్ రోడ్, గోల్కొండ చౌరస్తా, ముషీరాబాద్ చౌరస్తా మీదుగా కార్యక్రమం జరిగే కేఫీఫ్ ఫంక్షన్ హాల్‌కు తరలి వెళ్లారు. కార్యక్రమంలో నియోజకవర్గం బీజేపీ సీనియర్ నాయకులు శివాజీ, పూసరాజు పాల్గొన్నారు.

సందడి చేసిన చిన్నారులు



సుందరయ్య విజ్ఞానకేంద్రం: ఆట పాటలతో ఆ చిన్నారులు అలరించారు. నృత్యాలతో అదరహో అనిపించారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అంబర్‌పేట డీడీ కాలనీలోని ద బటర్‌ఫ్లై ప్రీ స్కూల్ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. సీతారామాంజనేయ స్వామి నృత్య రూపకం అలరించింది. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ ప్రీతీరాజు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ దంపతులకు సన్మానం



చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్ అభివృద్ధికి కృషిచేస్తున్న కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ దంపతులను బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో శనివారం గాంధీనగర్‌లోని కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పావని మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను నెరవేరుస్తూ ఆదర్శ డివిజన్‌గా తీర్చదిద్దేందుకు కృషిచేస్తున్నానన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు విజయలక్ష్మి, మంగమ్మ, స్వప్న, పూర్ణ, సంయుక్తరాణి, కృష్ణవేణి, అనూష తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు సాధ్యం



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీలత

సుందరయ్య విజ్ఞానకేంద్రం: క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని హోమియోపతి వైద్యులు డాక్టర్ శ్రీలత అన్నారు. శనివారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళాశాలలో జరిగిన సదస్సులో మాట్లాడుతూ.. ఉత్తమ వ్యక్తిత్వాన్ని కలిగి ఉన్న ప్రతి ఒక్కరికి మంచి గుర్తింపు, గౌరవం లభిస్తుందన్నారు. వ్యక్తి నిర్మాణ శీలంతోపాటు ఓపిక, పట్టుదల, ధైర్యం ప్రతి విద్యార్థి అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ విష్ణు ప్రియ, ప్రిన్సిపాల్ డాక్టర్ మట్టాశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బాలప్ప బాడలో రోడ్డు మరమ్మతులు చేపట్టండి



బాలప్పబాడలో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్

కాచిగూడ: బాలప్పబాడలో గుంతలు పడ్డ రోడ్లతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే రోడ్డుపై ప్యాచ్‌వర్క్ పనులు చేపట్టాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ జీహెచ్‌ఎంసీ అధికారులను కోరారు. శనివారం డివిజన్‌లోని లింగంపల్లి, కుర్మబస్తీ, బాలప్పబాడ తదితర ప్రాంతాలలో ఆమె పాదయాత్ర నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు బల్వీర్, కృష్ణకుమార్, శీర్‌సాగర్ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



ప్రాబీర్ గోష్

కవాడిగూడ: కుటుంబ సమస్యలతో ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన దోమలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ శ్రీనివాస్ రెడ్డి తెలిపిన మేరకు.. దోమలగూడలో నివాసం ఉండే ప్రాబీర్ గోష్ (60) కుటుంబ సమస్యలతో శుక్రవారం సాయంత్రం ఇంట్లో నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు అన్ని చోట్లా వెతికినా ఆచూకీ లభించకపోవడంతో దోమలగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సీఎం మాటలకు.. చేతలకు.. పొంతన లేదు

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



భరత్ గౌడ్‌ను సన్మానిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్

సుందరయ్య విజ్ఞానకేంద్రం: రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి 14 నెలల పాలన మాటలకు.. చేతలకు పొంతన లేకుండా ఉందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. దేశంలో మూడు రాష్ట్రాలలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ దివాలాకోరు పాలనను కొనసాగిస్తోందన్నారు. శనివారం మహంకాళి, సికింద్రాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా గుండగోని భరత్ గౌడ్ బాధ్యతలు స్వీకరించారు. ముషీరాబాద్‌లోని కేఫీఫ్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి కిషన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తేనే తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన యోధుల అకాంక్షలు నెరవేరుతాయని అన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాకుండా ఎంఐఎం పార్టీ అడ్డు తుగులుతోందని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నేతలు ఎంఐఎంకు అండగా నిలుస్తున్నారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మజ్లిస్ పార్టీ చేతిలో కీలుబొమ్మగా మారారన్నారు. హైదరాబాద్‌ను ఎంఐఎం నుంచి రక్షించుకోవాలన్నారు. ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ మాట్లాడుతూ... భరత్ గౌడ్ కుటుంబం బీజేపీ బలోపేతానికి ఎన్నో త్యాగాలు చేసిందని కొనియాడారు. ఆయన తండ్రి మైసయ్య గౌడ్ బీజేపీ నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేస్తూ నక్సల్స్ చేతిలో హతమయ్యారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాధ్యతలు చేపట్టిన భరత్ గౌడ్‌ను బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సి. కృష్ణయాదవ్, మాజీ ఎమ్మెల్సీ రాంచంద్రారావు, మాజీ జిల్లా అధ్యక్షుడు శ్యామ్ సుందర్ గౌడ్, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి



కార్యక్రమంలో పాల్గొన్న ఆర్ఈఎంఓపీఎస్ నాయకులు

అడ్డగుట్ట: రైల్వే ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఇండియన్ రైల్వే మూమెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీమ్ జాతీయ అధ్యక్షుడు సంతోష్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం లాలాగూడ రైల్వే క్యారేజ్ వర్క్‌షాప్ వద్దనున్న ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో బహిరంగ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన పెన్షన్, యూనిఫైడ్ పెన్షన్‌లు ఉద్యోగుల పాలిట గుదిబండలా మారాయన్నారు. ఈ పెన్షన్ స్కీమ్‌ల ద్వారా లక్షలాది మంది రైల్వే కార్మికులు నష్టపోతారని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం రైల్వే ఉద్యోగులకు పాత పెన్షన్ స్కీమ్‌ను పునరుద్ధరించే వరకు దేశ వ్యాప్తంగా బహిరంగ సభలు, నిరసన కార్యక్రమాలు చేపట్టి ఉద్యోగులను చైతన్య పరుస్తామన్నారు. ఐఆర్ఎంఓపీఎస్ ప్రధాన కార్యదర్శి అమిత్ మలంగి, సంతోష్ పాండే, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడితే చట్టపరమైన చర్యలు



అధికారులు, సిబ్బందితో సమావేశమైన జీఎం హరిశంకర్

అమీర్‌పేట: ఉద్యోగులు అవినీతికి పాల్పడితే విధుల నుండి తొలగించడమే క్రిమినల్ కేసులు పెడతామని జలమండలి డివిజన్-6 జనరల్ మేనేజర్ హరిశంకర్ హెచ్చరించారు. ఎస్ఆర్‌నగర్‌లో డివిజన్ పరిధిలోని డీజీఎంలు, సెక్షన్లలకు చెందిన మేనేజర్లు, వర్క్ ఇన్స్‌పెక్టర్లు, లైన్‌మెన్స్, మీటర్ రీడింగ్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయా డివిజన్ పరిధిలోని అన్ని చోట్ల నీటి కనెక్షన్లకు సంబంధించిన కమర్షియల్ సర్వేను 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ విషయంతో ఎవరైనా అవినీతికి పాల్పడితే ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఎలాంటి అంతరాయం నీటి సరఫరా జరిగేలా చూడాలన్నారు. నగరంలో చేపడుతున్న సీవరేజ్ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీలో భాగంగా 90 రోజుల స్పెషల్ డ్రైవ్ మొదటి దశ విజయవంతమైందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

నిమ్స్‌లో సెక్యూరిటీ గార్డుల ఆందోళన

లక్డీకాపూల్: వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ నిమ్స్ ట్రామా, స్పెషాలిటీ బ్లాక్ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న ఓపీడీఎస్ సెక్యూరిటీ సిబ్బంది శనివారం విధులు బహిష్కరించి యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆస్పత్రిలో 130 మంది గార్డులను నియమించాల్సిన ఉండగా 70మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారన్నారు. అరకొరగా సిబ్బంది ఉన్నా విధులు నిర్వహించిన తమ జీతాలు చెల్లించకపోవడం తగదన్నారు. ఈ విషయమై నిమ్స్ యాజమాన్యం చొరవ తీసుకుని బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.దీంతో నిమ్స్ అసిస్టెంట్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాకేశ్ ఓపీడీఎస్ నిర్వాహకులతో చర్చించి వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో 2 నెలల వేతనాలకు గానూ రూ.10వేలు చెల్లించేందుకు ఏజెన్సీ సంస్థ ముందుకు రావడంతో భద్రత సిబ్బంది ఆందోళనను తాత్కాలికంగా విరమింపచేశారు. వాస్తవానికి 130 మంది గార్డులు, ఆరుగురు సెక్యూరిటీ అఫీసర్లలకు కలిపి ప్రతినెల రూ.24 లక్షల వేతనాలు చెల్లించాల్సి ఉంది. అయితే నిమ్స్ యాజమాన్యం తమ బిల్లుల చెల్లింపుల్లో జాప్యం కారణంగా సకాలంలో వేతనాలు చెల్లించలేకపోతున్నామని ఓపీడీఎస్ సెక్యూరిటీ ఆఫీసర్ పేర్కొంటున్నారు.

నగర అభివృద్ధే ధ్యేయం

బంజారాహిల్స్: ఎన్నికల సమయంలోనే రాజకీయాలు, పార్టీల గురించి మాట్లాడతామని మిగతా సమయంలో అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తామని గ్రేటర్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. బంజారాహిల్స్‌రోడ్ నంబర్-1లోని ప్రేమ్‌నగర్ బస్తీలో రూ. 22.30 లక్షలతో సీసీ రోడ్డు పనులతో పాటు రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించనున్న 200 ఎంఎం డయా పైప్‌లైన్ పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొంతమంది నేతలు కాంట్రాక్టర్లను బెదిరిస్తూ పనులు ముందుకు సాగకుండా చేస్తున్నారని, ఇప్పటికైనా అలాంటివి మానేసి అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సర్కిల్-18 డీసీ ప్రశాంతి, ఈఈ విజయ్‌కుమార్, జలమండలి మేనేజర్ శివకుమార్ స్థానిక నేతలు పాల్గొన్నారు.

బీసీ జనాభా లెక్కలపై రాద్ధాంతం తగదు

బంజారాహిల్స్: కుల గణనలో బీసీల జనాభా తగ్గిందని రాద్ధాంతం చేయడం తగదని బీసీ రక్షణ సమితి జాతీయ అధ్యక్షుడు తీగల ప్రదీప్‌గౌడ్ పేర్కొన్నారు. సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2014లో కేసీఆర్ చేసిన సమగ్ర కుటుంబ సర్వేతో పోల్చి ఈ సర్వేలో 5 శాతం బీసీ జనాభా తగ్గిందని ఆరోపించడం అశాస్త్రీయమన్నారు. కులగణనలో లోపాలు లేకపోలేదని, కానీ కుల గణనే తప్పని వాదించడం సిగ్గుచేటన్నారు. ఎస్సీ వర్గీకరణలో లోపాలు ఉన్నాయని నిరసన తెలుపుతూనే ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ బిల్లును స్వాగతించారన్నారు. లోపాలను సవరించేందుకు ప్రభుత్వం మళ్లీ చర్యలు తీసుకోవడం గొప్ప విషయమని పేర్కొన్నారు. మళ్లీ చేపట్టే కుల గణనకు సహకరించాలని కోరారు.

అనారోగ్యంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి

సికింద్రాబాద్: అనారోగ్యంతో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన శనివారం సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. మేడ్చల్ రైల్వేస్టేషన్ 5వ నెంబర్ ప్లాట్‌ఫామ్‌పై వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నట్టు పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు అతను మృతి చెందినట్టు గుర్తించారు. మృతుడి గుర్తింపు కోసం పోలీసులకు ఆధారాలు లభించలేదు.

మౌలాలిలో గుర్తు తెలియని మహిళ మృతదేహం

◆ మౌలాలి రైల్వే యార్డు సమీపంలో మహిళ మృతదేహాన్ని పోలీసులు శనివారం గుర్తించారు. సికింద్రాబాద్ రైల్వే పోలీసుల కథనం ప్రకారం... సుమారు 60 ఏళ్ల మహిళ మృతదేహం మౌలాలి యార్డు ప్రాంతంలో గుర్తించిన పోలీసులకు మృతురాలి వివరాలు లభించలేదు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

రేవంత్‌రెడ్డి బీసీలకు క్షమాపణ చెప్పాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ కృష్ణయ్య

ముషీరాబాద్: ప్రధాన మంత్రి నరేంద్రమోదీని బీసీ కాదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కించపర్చడాన్ని రాజ్యసభ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య తీవ్రంగా ఖండించారు. శనివారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ..రేవంత్ రెడ్డి బీసీలకు క్షమాపణ చెప్పాలని, దేశంలోని బీసీలందరినీ ఆయన కించపరిచారని విమర్శించారు. ప్రధాన మంత్రి కన్వర్టెడ్ బీసీ అని అనడం ఆయన అవగాహన రాహిత్యం అని ధ్వజమెత్తారు.బీసీ సమస్యలపై, రిజర్వేషన్లపై జరుగుతున్న ఉద్యమాలను పక్కదారి పట్టించడానికి రేవంత్‌రెడ్డి వేసిన ఎత్తుగడ అని పేర్కొన్నారు. సమావేశంలో బీసీ సంఘం నాయకులు వేముల రామకృష్ణ, గొరిగె మల్లేష్ యాదవ్, సి.రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సేవిస్తున్న 8 మంది రిమాండ్

చిక్కడపల్లి: గుట్టు చప్పుడు కాకుండా గంజాయి సేవిస్తున్న 8 మంది యువకులను చిక్కడపల్లి పోలీసులు శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వీరివద్దనుంచి 300 గ్రాముల గంజాయి, రెండు ద్విచక్రవాహనాలు, 9 సెల్‌ఫోన్లు , రూ.12,270లను నగదును స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ రాజు నాయక్ తెలిపిన మేరకు.. ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని బస్‌భవన్ ముందుగల రోడ్డులో పలువురు యువకులు గుంపులుగా చేరి గంజాయి బేరాలు చేస్తుండగా చిక్కడపల్లి పోలీసులు, టాస్క్‌ఫోర్స్ బృందం వారిని పట్టుకున్నారు. వీరిలో రిసాలకు చెందిన మహ్మద్‌సిద్ధిక్‌ఖాన్(23), రాంనగర్‌కు చెందిన మహ్మద్ సోహెబ్(25), బేగంపేటకు చెందిన పీక జతీన్(21), రిసాలగడలకు చెందిన మహ్మద్ నసీర్(20), మహ్మద్ సాహిఫ్(21), బేగంపేటకు చెందిన ఆర్య(19),మహ్మద్ ఫరీద్‌ఖాన్(20), తిరుమలగిరికి చెందిన శెగ్గరి విష్ణుష్(26)నుంచి గంజాయిని,బైకులను,సెల్‌ఫోన్లను, నగదును స్వాధీనం చేసుకున్నారు.

ఆటో డ్రైవర్ల నిరసన

లాలాపేట: ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా విఫలమైందని ఏఐటీయుసి మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి బెజ్జాల కృష్ణమూర్తి అన్నారు. శనివారం ఆటో డ్రైవర్లు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల సమస్యలపై ఈ నెల 24న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించతలపెట్టిన రాష్ట్ర సదస్సుకు అన్ని రాజకీయ పార్టీల నేతలు హాజరైతున్నట్లు పేర్కొన్నారు.

'ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు సైదాఖాన్

సుందరయ్య విజ్ఞానకేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో సంచార జాతుల ముస్లిం తెగలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ సంచార ముస్లిం తెగల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సైదాఖాన్ డిమాండ్ చేశారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సంచార ముస్లిం తెగల సంఘం రాష్ట్ర స్థాయి సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సైదాఖాన్ మాట్లాడుతూ..రాష్ట్రంలో అత్యంత దుర్భర జీవితాన్ని ఈ వర్గాలు అనుభవిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక రకాల రకాల వృత్తులను చేసుకుంటూ జీవనాన్ని సాగిస్తున్న వారికి రాష్ట్రంలో గుర్తింపు లేకుండా పోయిందన్నారు. ముఖ్యంగా వీరికి కులసర్టిఫికెట్లు కూడా లేవని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాకూబ్, కోశాధికారి రసూల్, ఇమామ్, రషీద్, అలీ అబ్బాస్, కమల్, గౌస్, నాగుల్ మీరా తదితరులు పాల్గొన్నారు.

భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎస్ఆర్ లక్ష్మణ్ రావు

కాచిగూడ: దేవాలయాల భూములను కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని భజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.ఆర్.లక్ష్మణ్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కాచిగూడ లోని భజరంగ్ సేన రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గోషామహల్ నియోజకవర్గంలోని దూతరీ ఘాట్ దేవాలయం (షాహినాథ్ గంజ్), మహాలక్ష్మీ టెంపుల్, మహాదేవ్ టెంపుల్ (పీల్‌ఖానా) ఒక్కో దేవాలయాలనికి సంబంధించిన భూములను కబ్జాదారులు అక్రమించి 1100 గజాల నుండి 2000 గజాలను అమ్ముకున్నారని ఆరోపించారు. ఈ విషయంపై అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు.

మోదీని విమర్శించే.. నైతిక హక్కు సీఎంకు లేదు

బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి

కాచిగూడ: దేశ ప్రధాని నరేంద్రమోదీని విమర్శించే నైతిక హక్కు సీఎం రేవంత్‌రెడ్డికి లేదని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్ రెడ్డి అన్నారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ.. ప్రపంచలో భారత్‌కు మంచి గుర్తింపు తెస్తున్న ప్రధాని మోదీని కులం పేరుతో విమర్శించడం అనుచితమని ఆయన అన్నారు. శనివారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలలో వస్తున్న వ్యతిరేకతను కప్పిపుచ్చుకోవడానికే రేవంత్ రెడ్డి ఈ విధమైన విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రధాని మోదీ కుల ప్రస్తావన ఎప్పుడూ తేలేదని, ఆయన కులం గురించి రేవంత్‌రెడ్డికి సంబంధం ఏమిటని ప్రశ్నించారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లును అడ్డుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ వీఎల్ రాజు, వద్లమూరి కృష్ణస్వరూప్

కాచిగూడ: మార్చిలో జరిగే తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టం చేయడానికి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్రలను అడ్డుకోవాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వీఎల్ రాజు, గౌరవ అధ్యక్షుడు వద్లమూరి క్రిష్ణ స్వరూప్ పిలుపునిచ్చారు. వర్గీకరణ బిల్లును అడ్డుకోకపోతే మాలజాతికి భవిష్యత్తు లేదని, బానిసత్వం తప్పదని వారు అన్నారు. శనివారం నారాయణగూడలోని మాల మహానాడు కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడానికి జరుగుతున్న కుట్రలను మాల ప్రజా ప్రతినిధులు అడ్డుకోవాలన్నారు.

ప్రత్యామ్నాయ రాజకీయాలపై చర్చ



ఓయూ విద్యార్థి నేతలలో జాన్‌వెస్లీ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ విద్యార్థి నేతలతో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ముచ్చటించారు. శనివారం ఓయూ పరిశోధన విద్యార్థులు, విద్యార్థి నేతల ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీలో తెలంగాణలో భవిష్యత్తు ప్రత్యామ్నాయ రాజకీయాలు అనే అంశం చర్చాకార్యక్రమం జరిగింది. నూతన కార్యదర్శిగా ఎన్నికైన జాన్‌వెస్లీని విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

కొత్త సీవరేజీ పైప్‌లైన్ల నిర్మాణానికి కృషి

బంజారాహిల్స్: కొత్త సీవరేజీ పైప్‌లైన్ల నిర్మాణం చేపడుతామని జలమండలి డివిజన్-6 జీఎం హరిశంకర్ పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్-75లో సీవరేజీ పైపులైన్ లీక్ అవుతుందని స్థానికుల ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ సెక్షన్ మేనేజర్ రాంబాబుతో కలిసి శనివారం ఉదయం పర్యటించారు. జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్ కార్యదర్శి కిలారు రాజేశ్వరరావుతో పాటు స్థానిక మహిళలు సీవరేజీ సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లారు. భారీ చెట్ల వేర్లు డ్రైనేజీ పైప్‌లైన్లలోకి వెళ్లి పగిలిపోవడంతో నీరంతా లీకవుతుందని మహిళలు పేర్కొన్నారు. స్పందించిన జీఎం కొత్త పైప్‌లైన్ వేసేందుకు ప్రతిపాదనలు రూపొందిస్తామని తెలిపారు.

కేసీఆర్ హయాంలో క్రీడలకు పెద్దపీట

మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి



బీఆర్ఎస్వీ కాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి తదితరులు

ఉస్మానియా యూనివర్సిటీ: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో క్రీడలకు పెద్ద పీట వేసినట్లు మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి అన్నారు. ఈ నెల 17న కేసీఆర్ జన్మదినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి నాగరం ప్రశాంత్ ఆధ్వర్యంలో జరుగుతున్న కేసీఆర్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ ప్రారంభానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో పట్టణాలతో పాటు గ్రామాల్లోను క్రీడా కారులను ప్రోత్సహించేందుకు ప్రత్యేకంగా క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసిన్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలను పూర్తిగా నిర్వీర్యం చేసిందని విమర్శించారు కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డా గాదరి కిశోర్‌కుమార్, ఎస్సీ ఎస్టీ కమీషన్ మాజీ చైర్మన్ డా.ఎర్రోళ్ల శ్రీనివాస్, మాజీ స్పోర్ట్ చైర్మన్ అల్లిపురం వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేలెండర్‌ను ఆవిష్కరించారు.

ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి

సుందరయ్య విజ్ఞానకేంద్రం: గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ 286 వ జయంతి ఉత్సవాలు శనివారం సుందరయ్యపార్కులో వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. సంత్‌సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు పీవీ నిరంజన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్ మనోహర్‌రెడ్డి, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

బంజారాల ఆధ్యాత్మిక మార్గదర్శి..

చిక్కడపల్లి: బంజారా జాతికి ఆధ్యాత్మిక మార్గదర్శిగా సంత్ సేవాలాల్ మహారాజ్ నిలిచారని నగర గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేశిరెడ్డి ఉపేందర్‌రెడ్డి అన్నారు. శనివారం చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయంలో సేవాలాల్ విద్యార్థి సేన ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బంజారాల ఆరాధ్య దైవం, సంఘ సంస్కర్త అని కొనియాడారు. కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి పి.పద్మజ, సిబ్బంది పాల్గొన్నారు.



సుందరయ్యపార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో...



వేడుకల్లో పాల్గొన్న నగర గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేశిరెడ్డి ఉపేందర్‌రెడ్డి